సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,20 జూలై 2024


## నేడు వేలేరుపాడు మండలంలో మంత్రి పార్థసారథి పర్యటన



**వేలేరుపాడు,మేజర్న్యూస్:** వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈనెల 20వ తేదీ శనివారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించనున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు వేలేరుపాడు చేరుకొని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వరద ముంపు బాధితులను పరామర్శిస్తారు.

## కొండవాగుపై రాకపోకలు నిలిపివేత



బుట్టాయిగూడెం,మేజర్న్యూస్ : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కల్వర్టులు కొట్టుకు పోయాయి. మండలంలోని రెడ్డి గణపవరం గ్రామ సమీపంలోని కొండవాగు పొంగడంతో కల్వర్టు పూర్తిగా పాడైపోవడం వలన ఈరహదారిపైన రాకపోకలు నిలిపివేశారు. ఈ రహదారిపై ప్రయాణం చేసే ప్రజలు మరో మార్గం ద్వారా వెళ్లాలని పోలీసులు సూచించారు. ఇప్పలపాడు గ్రామం వద్ద జిల్లేరు కాలువకు చెట్లు కొమ్మలు తుప్పలు అడ్డుపడడంతో జెసిబితో పోలీసులు వాటిని తొలగించారు.

అత్యవసర సమయంలో సంప్రదించేందుకు మండలంలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారా లేదా అని పలువురు చెప్పుకుంటున్నారు.





# మేమున్నాం - ఆదుకుంటాం


- వరద బాధితులకు కలెక్టర్ భరోసా
- జిల్లా ఎస్పి,ఐటిడిఎ పిఓ,జేసి,అధికారులతో పర్యటన

**వేలేరుపాడు,మేజర్న్యూస్:** పెద్దవాగు వరద ముంపునకు గురైనా వేలేరుపాడు మండలం అల్లూరినగర్ వాసులను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ శుక్రవారం పరామర్శించి బాధితుల్లో భరోసాను నింపారు. పెద్దవాగు వరద ముంపునకు గురైనా వేలేరుపాడు మండలం అల్లూరినగర్ వాసులను శుక్రవారం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఏం.సూర్యతేజ,ఆర్డీఓ కె.అద్దయ్య, వివిధ శాఖల అధికారులతో కలిసి పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలను ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లలు,వృద్ధులను అత్యవసరంగా వరద సహాయ కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. వరద సహాయక కేంద్రాలలో బాధితులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కారు వెళ్లలేని మారుమూల ప్రాంతాలకు బైక్ మీద ప్రయాణించి బాధితులను కలిసి వారి సమస్యలను తెలుసుకుని, వరద సహాయక కేంద్రాలకు రావలసిందిగా కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

అనంతరం పెదవాగు బ్రిడ్జ్ పై గండి పడిన ప్రాంతాన్ని కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుంటుందని ఇకనుండిఈదిశగా చర్యలు తీసుకోవా లని తెలంగాణా ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ సూచిం చారు. కలెక్టర్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్ రాజు, డిపివో టి. శ్రీనివాస విశ్వనాథ్, తహశీల్దారు, డిఎస్పీ తదితరులు ఉన్నారు.

# ఉగ్రరూపం దాల్చిన ఎర్ర కాల్వ

- 2వేల క్యూసెక్కుల నీరు విడుదలతో పూర్తిగా జలమయమైన పంట పొలాలు

**తాడేపల్లిగూడెం,మేజర్న్యూస్:** కుండపోతగా కురుస్తున్న వర్షాలకు జంగారెడ్డిగూడెం ఎర్ర కాలువ ప్రాజెక్టు నుండి ఎలాంటి సమాచారం లేకుండా రెండు గేట్లు ద్వారా ఒకేసారి సుమారు 2వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. దీంతో ఎర్రకాల్వ ఉగ్రరూపం దాల్చింది. గడిచిన ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా వరద పోటెత్తడంతో ఎర్రకాలువ పరివాహక ప్రాంతాల్లో వరద ప్రభావం తీవ్ర రూపం దాల్చింది.ఈకారణంగా తాడేపల్లిగూడెం మండలంలోని వీరంపాలెం పట్టింపాలెం జగన్నాథపురం నందమూరి గ్రామాల్లోని వేలాది ఎకరాలు ముంపుబడిన పడ్డాయి.రికార్డు స్థాయిలో నందమూరి ఆక్విడెక్టు వద్ద 33 అడుగుల నీటిమట్టం నమోదవడం విశేషం.కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో వరద ఉధృతికి ఎక్కడికక్కడ గండ్లు ఏర్పడ్డాయి. ఫలితంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం పరిధిలో 9వేల 500 హెక్టార్ల పంట నీటమునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.90శాతంవరినాట్లువేసినరైతులు పంట మునిగిపోవడంతో అధికంగా నష్టపోయారు. వర్షం తగ్గు మొహం పెట్టకపోవడం రైతులలో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎర్ర కాలువ ఉధృతి వల్ల తణుకు నియోజకవర్గంలోని దువ్వ పరిసర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ,కలెక్టర్ నాగరాణితో కలిసి ముంపు గురవుతున్న ప్రాంతాలను పరిశీలించారు. మరోవైపు తాడేపల్లిగూడెం నియోజకవర్గం వరద ముప్పుకు గురైన ప్రాంతాలలో కూటమి నాయకులతో శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాసు వీరంపాలెం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, మాధవరం, ఆరుళ్ల, నందమూరి పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. వీరితో సంబంధిత అధికారులు కూడా ఉన్నారు. నందమూరిలో ముంపుకు గురైన ప్రాంతాలలో నుండి తీసుకువచ్చిన ప్రజలను సురక్షిత ప్రాంతంలో ఉంచారు. వారికి కావలసిన వసతులు సౌకర్యాలను స్వయంగా కూటమి సభ్యులతో ఎమ్మెల్యే బొలిసెట్టి వెళ్లి తక్షణ సౌకర్యాలు అందించాలని అధికారులను ఆదేశించారు.

## వయ్యేరు కాలువ ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్,ఎమ్మెల్యే



**అత్తిలి,మేజర్ న్యూస్:** అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వయ్యేరు కాలువ ప్రాంతాన్ని శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సి.నాగరాణి,తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ పరిశీలించారు. ఈ పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.ఈ పర్యటనలో బల్లిపాడు తెలుగుదేశం నాయకులు గారపాటి బాబ్జి,విత్తంశెట్టి సత్తిబాబు,ప్రగడ నాగేశ్వరరావు,ఎంపిటిసి కాళ్ళ సురేష్ వంటాకుల శ్రీనివాస్ విత్తంశెట్టి సూర్యచంద్రరావు జనసేన నాయకులు ఆకు రామచంద్ర రావు కసిరెడ్డి అప్పారావు వీరు పాల్గొన్నారు.

## పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన కమీషనర్



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** వర్షాలు వస్తారంగా కురుస్తూ ఉండటంతో నీరు నిల్వ ఉన్న పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు శుక్రవారంపర్యటించారు.గాంధీ విగ్రహం సెంటర్, తదితరచోట్ల రోడ్డుపై నీళ్ళు ఉండటం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొన్నిచోట్ల డ్రైన్ లపై మూతలు లేకపోవడంతో వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీచుపాలెం హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న రక్త పరీక్ష శిబిరాన్ని కమిషనర్ పరిశీలించారు. పలుచోట్ల డ్రైన్ లు ఆక్రమణలకు గురి కా గా వెంటనే తొలగించి మురుగునీరు సా పీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాల్లో టి పిఓ శేషగిరిరావు, మున్సిపాల్ డి ఈ తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



**నర్సాపురం రూరల్,మేజర్న్యూస్ :** మండలంలోనివేములదీవి వెస్ట్, సర్దుకొడప,వడ్డే వారి మెరక, కాపులకొడప,చిన్నమైనవానిలంక ముంపు గ్రామాలను శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం వేములదివి పడమర చిన్నమైనవాని లంకలో దుర్గాదేవి గుడి వధ బోజనం చేసి చిన్నమైనవానిలంక వంతెననిపరీక్షించి తక్షణం దాని శాశ్వత పరిష్కారం చేసే విధంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లాలో నేడు అన్ని విద్యాసంస్థలకు శెలవు

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఎడతెరిపిగా కురుస్తున్న వర్షం కారణంగా 20.7. 2024 (శనివారం) ఏలూరు జిల్లాలో అన్ని విద్యాసంస్థలకు శెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహాం తెలిపారు.

# మానవత్వం చాటిన మంత్రి కొలుసు పార్థసారథి





**నూజివీడు,మేజర్ న్యూస్:** నూజివీడు మండలం దేవరగుంట గ్రామానికి చెందిన సుమారు 65 మంది కలిసి ఒక ప్రవేటు వాహనంలో గురువారం ఉదయం జంగారెడ్డిగూడెం గూడెం సమీపంలో గల గుబ్బలమంగమ్మ తల్లి దర్శనానికి వెళ్లిన భక్తులు అకస్మాత్తుగా ఒక్కసారిగా వచ్చిన వరదల్లో గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో చీకటి అరణ్యంలో చిక్కుకున్న 65 మంది భక్తులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ఇక దేవుడే మనల్ని రక్షించాలని అనుకొని గుబ్బలమంగమ్మ తల్లికి మొక్కుకొని తల్లిని వేడుకుంటున్న సమయం అదే గ్రామానికి చెందిన భక్తుడు వంకాయలు హరిబాబు స్పందించి రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కి సమాచారం అందించగా వెంటనే స్పందించిన మంత్రి ఆర్.టి.సి.డిపో మేనేజరు,ఇతర అధికారులతో మాట్లాడి తక్షణమే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి సురక్షిత ప్రాంతానికి తరలించాలని అధికారులకు ఆదేశించిన మంత్రి కొలుసు పార్థసారథి. ఆర్.టి.సి. డిపో మేనేజరు ఒక ప్రత్యేక బస్సును ఏర్పాటుచేసి భక్తులను వారి గమ్య స్థానాలకు చేర్చిన ఆర్.టి.సి. సిబ్బంది, ప్రాణాలతో తిరిగి వస్తామో లేదో అని అధైర్య పడే సమయంలో మా మనవి ఆలకించి మమ్మల్ని ప్రాణాలతో ఇంటికి సురక్షితంగా చేర్చిన రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి జీవితాంతం ఋణ పడివుంటామని భక్తులు వారి కృతజ్ఞతను, ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మంత్రిని మునుపెన్నడూ మేము చూడలేదని కలకాలం మీరే మాకు ఎమ్మెల్యేగాగా ఉండాలనిఆగుబ్బల మంగమ్మ తల్లిని కోరుకుంటున్నామని వారి హర్షాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# వరద ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే పర్యటన




వేలేరుపాడు,మేజర్ న్యూస్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇబ్బందులు పడుతున్న ఏజెన్సి లోని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రతీ ఒక్క అధికారి సక్రమ విధులు నిర్వర్తించాలిని జిల్లా కలెక్టర్ వేట్రి సెల్వి ఆదేశించారు. ఆమెతో పాటు పోలవరం నియోజక వర్గ ఎమ్మెల్యే చిర్రి బాల రాజు ఉన్నారు.స్థానిక అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. 24 గంటల భారీ వర్షాలకు ఏజెన్సీ లోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని అనేక గ్రామాల ప్రజలు వరదకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృశ్యా మేమున్నాం అనే భరోసా కల్పించారు. తెలంగాణలోని పెద్దవాగు ప్రాజెక్టు కింద ఉన్న అనేక గ్రామాలు భారీ వర్షాలకు చిగురుటాకులా ఓనికిపోయాయి.ప్రాజెక్టుకు రెండు చోట్ల గంటి పడటంతో మరింతగా అనేక గ్రామాల ప్రజలు భారీ వరదకు బతుకు జీవుడా అంటూ కాలం వెళ్ళదీ శారు.కమ్మరి గూడెం గ్రామస్తులకు నిత్యావసర వస్తువులు, గిన్నెలను పోలవరం నియోజక వర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పంపిణీ చేశారు.కాగా మండలంలోని అనేక పశువులు మృత్యువుకు గురి అయ్యాయి.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో పటిష్ట సహాయక చర్యలు




**భీమవరం, మేజర్ న్యూస్:** జిల్లాలో భారీ వర్షాలు కారణంగా ఏర్పడిన పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోవివిధప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా అధిక వర్షాలు కురుస్తున్న అల్లూరి సీతారామరాజు,పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్షించారు. భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో ఉన్న తాజా పరిస్థితులపై అధికారులను అడిగితెలుసుకున్నారు. వాతావరణ శాఖ ద్వారా వర్షాలు, వరదలను అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం అన్నారు. ముందస్తు ప్రణాళికతో పనిచేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ ఏడాది లో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 185 మి.మి గాను 244 మి.మి నమోదైందని, రాష్ట్ర వ్యాప్తంగా 31శాతం అదనంగా వర్షపాతం నమోదైందని అన్నారు. 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయిన ప్రాంతాలు కూడా ఉన్నాయన్నారు. చెరువు కట్టలు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు.ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఫ్లడ్ మాన్యువల్ ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో అధిక వర్షాలు కారణంగా ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికి అన్నివిధాల సిద్ధంగా ఉన్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్లోజిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, నీటిపారుదలశాఖ ఈఈ దక్షిణామూర్తి, భీమవరం ఆర్డీవో బి.శ్రీని వాసులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ నుండి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ఎంపీ



**న్యూఢిల్లీ/ఏలూరు,మేజర్ న్యూస్ :** వివిధ సమీక్షా సమావేశాలలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ కూడా డిల్లీ నుండి ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ జిల్లాలో వరద పరిస్తితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. కలెక్టర్ ,ఎస్పీతో సమన్వయం చేసుకుంటూ, స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే, తదితర ప్రజా ప్రతినిధులకు తగు సూచనలు చేస్తున్నారు. ఎర్రకాలువ జలాశయ నీటి మట్టాన్ని అంచనా వేసుకుంటూ ప్రజాప్రతినిధులను, అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

## అధిక వడ్డీ భూమి కొనుగోలు పథకం ప్రాధాన్యత



**దెందులూరు,మేజర్ న్యూస్:** బెంగుళూరు గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న వినియోగదారుల అధిక వడ్డీ ఆసక్తి గలవారు భూమి కొనుగోలు చేస్తే ఎటువంటి తనఖ లేకుండా 3 లక్షల వరకు మంజూరు చేయడం జరుగుతుందని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ దెందులూరు మేనేజర్ టి నాగార్జున అన్నారు. శుక్రవారం గ్రామీణ బ్యాంక్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూబ్యాంక్ వినియోగదారుల సౌకర్యార్థం వారి నగదు బంగారం డాక్యుమెం ట్లకు పూర్తిస్థాయి భద్రతకు స్ట్రాంగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు దేశంలోనే అత్యధిక వడ్డీ ఇచ్చే ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంకుల్లో ఒకటైన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్లో ఖాతాదారులుగా చేరి బ్యాంకు కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు . బంగారంపై రుణ సౌకర్యం ఉందన్నారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఆర్డివో ఖాజావలి




**ఏలూరు,మేజర్ న్యూస్:** తమ్మిలేరు వరద దృష్ట్యా ముందస్తు చర్యగా ఏలూరు అర్బన్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలను శుక్రవారం ఏలూరు ఆర్డిఓ ఎన్ఎస్ కె ఖాజావలి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నగరంలోని నదీపరివాహక ప్రాంతమైన సాయినగర్, వైఎస్ఆర్ కాలనీ, ఎస్ఎంఆర్ నగర్, కొమడవోలు, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రస్తుతం తమ్మిలేరులో నీటి ప్రవాహం లేదని తెలిపారు. వీరి వెంట నగరపాలక సంస్థ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, ఏలూరు తహశీల్దారు మురార్జి, ఇరిగేషన్ డిఇ ఉన్నారు.

# వై యన్ కళాశాలలో ఎగ్జిక్యూటివ్ ఇంటరాక్షన్



నర్సాపురం,మేజర్ న్యూస్: స్థానిక వైయన్ కళాశాలలో హెచ్ఆర్డి సెంటర్ ఆధ్వర్యంలో ఎంసీఏ, బిఎస్సి విద్యార్థులకు శుక్రవారం ఎగ్జిక్యూటివ్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ సిహెచ్ కనకారావు అధ్యక్షత వహించారు. యూఎస్ఏ కి చెందిన ఎన్ లక్ష్మీకాంత్, హైదరాబాద్ విప్రో కంపెనీకి చెందిన ఇంజనీర్ ఆర్ దేవి ప్రసాద్ లు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ ఉంటే ఉద్యోగాలు పొందటం సులభం అన్నారు. కార్పొరేట్లో స్థిరపడాలంటే కెరీర్ ప్లానింగ్ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి సుబ్బారావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, సిహెచ్ రవికుమార్, సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రజక సంఘ అధ్యక్ష ,కార్యదర్శులుగా నాగరాజు, వెంకటసుబ్బారావు



ముదినేపల్లి,మేజర్ న్యూస్ : ముదినేపల్లి రజకసంఘం అధ్యక్షులుగా యలకుర్తి నాగరాజు ,కార్యదర్శిగా రావులపాటి వెంకటసుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మీసాల సత్యనారాయణ ,రాజమండ్రి శ్రీనివాసరావు, సంయుక్తకార్యదర్శిగా నిడుమోలు హనుమంతరావు, మాడెం శ్రీను,కోశాధికారిగా మల్లంపల్లి కొండలరావులను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గం ఏర్పాటు అనంతరం ఈ తీర్మానాన్ని ముదినేపల్లి గ్రామపంచాయతీ అధికారులకు అందజేశారు.

# వరద ప్రమాదం ముగిసే వరకు అప్రమత్తత





- అధికారులు,సిబ్బంది అందరూపూర్తిగా నిమగ్నంకావాలి
- రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమత్తులు
- ప్రాణ,ఆస్థి నష్టాలు జరగకుండా చర్యలు
- వర్ష పీడిత ప్రాంతల్లో జిల్లా కలెక్టర్,జేసి, ఎస్పి,ఐటిడిఏ పిఓ.ఆర్డిఓ పర్యాటణ

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** జిల్లాలో వరద ప్రమాదం ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అందరూ పూర్తి అప్రమత్తతతో ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలో వరద విపత్తును ఎదుర్కొనేందుకుజిల్లాయంత్రాంగంసిద్ధమైంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాలలో జిల్లా ఎస్పీ,ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, ఇతర జిల్లా అధికారులతో పర్యటించి వరద పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతర వరద అత్యవసర పరిస్థితిపై తీసుకోవలసిన చర్యలపై జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వరద ప్రభావిత గ్రామాలలో సహాయక చర్యల నిమిత్తం రహదారి మార్గాలను యుద్ధప్రాతిపదికన మరమత్తులు చేయాలన్నారు. వరదల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవలసిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా యంత్రాంగంనుఆదేశించారన్నారు కుక్కునూరు,వేలేరుపాడు మండలాల్లోని 24 గ్రామాలు ప్రస్తుతంవరదప్రభావానికి గురయ్యాయని,ఆయా గ్రామాలలోని ప్రజలను వరద సహాయ కేంద్రాలకు తరలించి భోజన, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు.వరద సమయంలో ప్రజలు సమాచారం తెలుసుకొనుటకు లేదా తమ సమస్యలను తెలియజేసే ందుకు జిల్లా స్థాయిలో 24 గంటలూ పనిచేసే కమాండ్ కంట్రోల్ రూమ్‌ను టోల్ ఫ్రీ ఫోన్ 1800 233 1077తో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ విపత్తు నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లా అధికారి స్థాయి నుండి గ్రామంలోని చివరి స్థాయి సిబ్బంది వరకు అందించేందుకుగాను పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈసమావేశంలోజిల్లాజాయింట్‌కలెక్టర్ బి.లావణ్య వేణి,ఐటిడిఏప్రాజెక్ట్అధికారిఎం.సూర్యతేజమాట్లడారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య,జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.శర్మిష్ట, డిపి ఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, పశుసంవర్ధక శాఖ జెడి నెహ్రు బాబు, ఇరిగేషన్ ఎస్ఈప్రకాష్,ఐసిడిఎస్పీడీపద్మావతి,ప్రభృతులు పాల్గొన్నారు.

## రేవు బకాయికి ముదునూరికి సంబందం లేదు - వైసీపీ నేతలు



నర్సాపురం,మేజర్ న్యూస్ : మాధవాయపాలెం ఫెర్రి పాటకు మాజీ శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజుకి ఎటువంటి సంబంధం లేదని ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులుకోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీపి మైలబత్తుల సోనీ, జడ్పిటిసి బొక్క రాధాకృష్ణ, వై కే ఎస్, కామన బుజ్జి, షేక్ బులి మస్తాన్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. నిబంధనలప్రకారమే రేవు పాటను రెడ్డప్ప దవేజి పాడుకున్నారని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ము కొంతమిగిలి ఉండటంతో త్వరలో కడతానని చెప్పారన్నారు.

ఒకవేళ ఆ సొమ్ము కట్టకపోతే నిబంధనల ప్రకారం వ్యవహరించేవారుమని, ఈ విషయంలో ఎంపీడీవో ఆత్మహత్యా ప్రయత్నానికి పూనుకోవాల్సిన అవసరం లేదన్నారు. ముదునూరి ప్రసాదరాజును ఈ విషయంలో పనిగట్టుకుని కొంతమంది అల్లరి చేస్తున్నారని, ఇది సమంజసం కాదన్నారు. ఎంపీడీవో రమణారావు క్షేమంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. రెడ్డప్ప దావేజీ బకాయి ఉండటం వల్ల రేవును స్వాధీనం చేసుకుని ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## అధిక వర్షాల వల్ల మూడు ఇళ్లకు నష్టం - తహసిల్దార్ ప్రసాద్



నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ : అధిక వర్షముల కారణముగా మండలంలోని పలు గ్రామాల్లో మూడు ఇల్లు దెబ్బ తిన్నట్లు తహసిల్దార్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారంఆయన ముంపు ప్రాంతములైన అరుందటిపేట, కొత్త నవరసపురం, పాతనవరస పురంలలో గల ముంపు ప్రాంతములను పరిశీలించారు. అనంతరం బియ్యపు తిప్ప స్లుయిస్‌ను ఏఈ హెడ్ వర్క్ డివిజన్,నర్సాపురం వారితో కలసి పరిశీలించారు. అధిక వర్షముల కారణములు తూర్పుతాళ్ళు,చమకూరిపాలెం, లక్ష్మణేశ్వరం గ్రామముల యందు 3 ఇల్లు దెబ్బతిన్నట్లు తాసిల్దార్ తెలిపారు. ఇప్పటివరకు నర్సాపురం మండలములో 123.70 హెక్టార్ల ఆకుమడులు నీట మునిగినట్లు ఆయన తెలిపారు.

## నిత్యాన్నదానానికి విరాళాలు





**ద్వారక తిరుమల, మేజర్ న్యూస్:** శ్రీ ఒకుళమాత నిత్యాన్నదాన ట్రస్ట్ కు వేరు వేరు ప్రాంతాల వారు ఆలయ సిబ్బందికి శుక్రవారం ఉదయం విరాళాలను సమర్పించారు. ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. పినకడిమి గ్రామానికి చెందిన వెంక చేజెర్ల శ్రీనివాస్ స్వామి వారి నిత్య అన్నదానంమునకు రూ 3లక్షల12వేలు చెల్లించినారు. అలాగే కాళ్ళ చెరువు కు చెందిన మురుము టాప్కం శ్రీనివాస్ (జమిందార్) స్వామి వారి నిత్య అన్నదానం మునకు రూ 1లక్ష16వేలు చెల్లించినారు. దాతలకు అన్నదాన సూపరింటెండెంట్ రాజు విరాళ పత్రాలను స్వామివారి ప్రసాదాలను అందజేసే అభినందనలు తెలిపారు.

## భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ఏలూరు,మేజర్ న్యూస్:** భారీ వర్షాలతో పంటలు ముంపునకు గురై నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఏలూరు అన్నే భవనంలో భారీ వర్షాల పంట నష్టాల పై అయన మాట్లాడారు. జిల్లా లో గత రెండు రోజులు గా కురుస్తున్న భారీ వర్షాలకు వరి నారుమళ్ళు, నాట్లు వేసిన చేలుకు నష్టం జరిగే పరిస్థితి ఉందన్నారు. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతంలో కాలువలు ఆధునీకరణ జరగక పోవడం, కాలువల్లో గుర్రపుడెక్క,తూడు, కర్ర నాచు, కిక్కిస పేరుకు పోవడం ముంపుకు కారణమని చెప్పారు. ఇప్పుడైనా కాలువలు ఆధునీకరించాలని కోరారు. ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు.

## సాయి సేవకులకు వస్త్ర బహుకరణ



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక ఆదివారం పేటలో వేంచేసి ఉన్న శ్రీ సాయిబాబా ప్రేమ మందిరం లో ఆలయ అధ్యక్షులు శ్రీ ఇసుకపల్లి తాతారావు గారి ఆధ్వర్యంలో బాబా గారికి పట్టు వస్త్రాలను సమర్పించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూనం ప్రారంభం నుండి నేటి వరకు ప్రేమ మందిరం అభివృద్ధికి సేవలందిస్తున్న సాయి సేవకులకు పైజామా,లాల్చీ దుస్తులను బహుకరించారు. అర్చకులు గంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన గురు పౌర్ణమి పురస్కరించుకొని ఆరోజు తెల్లవారుజాము నుండి రాత్రి వరకు విశేష పూజలు ఉంటాయని యావన్మంది భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రాల సంతోష్ ప్రవీణ్, ఊడా దుర్గ ప్రసాద్, దేవపూజల రంగబాబు, లక్కంశెట్టి రూపేష్, కొమ్మవెంకన్న, శ్రీనివాస్,ముత్యాల బాబ్జి,గొంతిన రామకృష్ణ, కొమ్మసునీల్, శేఖర్, నున్నగురునాథం, ఆదిత్య, షిరిడి సాయి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంత ప్రజల బ్రతుకులు మారలేదు

- బ్రిడ్జిలు నిర్మించడంలో ప్రభుత్వాలు విఫలం

**బుట్టాయగూడెం,మేజర్ న్యూస్:** స్వాతంత్రం వచ్చి 70 ఏడు సంవత్సరాలవుతున్న ఏజెన్సీ ప్రజల బతుకులు మారలేదని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అందుగుల ఫ్రాన్సిస్ అన్నారు. మండలంలోని రెడ్డి గణపవరం గ్రామ సమీపంలోని కాలువ వద్ద ఫ్రాన్సిస్ విలేకరులతో మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి కొండవాగులు పొంగి పర్లటంతో బయట ప్రపంచ సంబంధాలు తెగిపోతున్నాయని, అత్యవసర సమయాల్లో ఆరోగ్య సమస్యలు ఎదురైతే ఎన్ని రోజులైనా గ్రామాలను మగ్గిపోవాల్సి వస్తుందని తెలియజేశారు. ఈ గ్రామాల్లో ఉన్న కాలువలకి బ్రిడ్జిలు నిర్మించాలని దళిత గిరిజన ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయని పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని పట్టనపాలెం గ్రామంలో బ్రిడ్జి ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వాలు ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారని మండి పడ్డారు. ఏ ప్రభుత్వం వచ్చిన ఏజెన్సీ ప్రజల సమస్యలు పట్టించుకునే పాపాన పోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బ్రిడ్జిలుకి ఎస్టిమేట్ వేసి కట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివుడి భీముడు సున్నం కృష్ణ పాతపాటి సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముంపునకుగురైన నారుమడులను పరిశీలించిన ఎమ్మెల్యే నాయకర్



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్:** పలు గ్రామాల్లో అధిక వర్షాల వల్ల ముంపునకు గురైన నా రుమడులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని సరిపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు డ్రయినైజికనెక్టివిటీ లేదని, రైల్వే ట్రాక్ నిర్మాణంలో పాలకొల్లు హైవే దగ్గర డ్రయిన్ అండర్ పాస్, ఐదుతుములు దగ్గర శాశ్వత పరిష్కారం చూపాలని అది సరి చేసుకుంటే వచ్చే సీజన్స్ నాటికి ఎటువంటి సమస్య ఉండదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

గత ప్రభుత్వంలో పేరు గొప్ప ఊర దిబ్బ అన్నట్టు వచ్చి ఫొటోస్ దిగి అధికారులుకి ఏ మాత్రం నిర్దేశాలు చూపకుండా కాంట్రాక్టర్లకి వత్తసు పలికి ఇలా ఇబ్బందులకు గురి అయ్యేలా ముందు చూపులేని పనులు వల్ల 6 గ్రామాలు ఇబ్బంది పడుతున్నాయని గ్రామస్తులు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ,దీనిని పరిష్కారం అయ్యాలా చెస్తాను అని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటాం

### ఎర్ర కాలువ ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** ఎర్ర కాలవ వరదలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఎర్రకాలువ వరదలకు మండలంలోని వీరంపాలెం కొమ్ముగూడెం పట్టింపాలెం, అప్పారావుపేట జగన్నాధపురం మాధవరం మారంపల్లి,నందమూరు, నవాబ్ పాలెం, దండగర్ర గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి,బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఎర్రకాలువ గట్లు పటిష్టం చేశామని కానీ గత వైసిపి ప్రభుత్వం కనీసం ఎర్రకాలువ వైపు చూసిన పాపాన పోలేదన్నారు.
అనంతరం జగన్నాధపురంలోని వరద బాధితుల నిరాశ్రయ కేంద్రాలను ఆయన సందర్శించి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆయాగ్రామాలసర్పంచులు ఎంపీటీసీలు కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# విస్తారంగావర్షాలు.. స్తంభించిన జనజీవనం



**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** మూడు రోజులుగా కురుస్తున్న విస్తారవర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. నారుమళ్ళు పోసిన రైతులు ఇప్పటికే వరి వెదజల్లిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ముదినేపల్లి మండలంలో వెదజల్లినవరి 9 వేల ఎకరాలలో సాగు చేయగా 50 ఎకరాలలో వరి నారుమళ్ళుపోశారు.

ఈ వర్షాలకు చిరు వ్యాపారులు ,చేతివృత్తుల వారు పనిలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముదినేపల్లి-గుడ్లవల్లేరు ఆర్ అండ్ బి రహదారి, ముదినేపల్లి-కోరుకొల్లు ప్రధాన రహదారి, చిగురుకోట ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. రహదారులు చిద్రం కావడంతో వాహనదా రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతర్గత వీధులు పలుగ్రామాల్లో బురదమయం అయ్యాయి. లోతట్టు కాలనీలో అంతర్గత వీధులు చిత్తడిగా మారాయి. గ్రామాల్లో వర్షపు నీరు పోయే విధంగా చర్యలు తీసుకుని దోమలు ప్రబలకుండా దోమల మందు పిచికారీ చేసి,బ్లీచింగ్ చల్లి పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ముదినేపల్లి మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నాటికి 38.8 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు.

# జిల్లాలో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు

- డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్



**ఏలూరు , మేజర్ న్యూస్:** వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో జిల్లాలో అన్ని గ్రామాలలో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. వేలేరుపాడు మండలంలో పలు వరద ప్రభావిత ప్రాంతాలలో సుడిగాలి పర్యటన చేసిన డీపీఓ గిరిజన ప్రాంతాలైన మేడేపల్లి, అల్లూరినగర్, కోయమాధవారం, రామవరం, వేలేరిపాడు తదితర ప్రాంతాలలో జరుగుతున్నా శానిటేషన్ కార్యక్రమాలను పరిశీలించారు. సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ వర్షాలు కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా 1450 త్రాగునీటి ట్యాంకులు శుభ్రపర్చి స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తున్నామని అన్నారు.

జిల్లాలో ఉన్న 14 వందల మంది క్లాప్ మిత్రాల సేవలు వినియోగిస్తూ గ్రామాలలోపరిసరాలుశుభ్రంగాఉంచడం జరుగుతుందని అన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వర్షాలకు ప్రజలందరు కాచి చల్లార్చిననీరు త్రాగాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ రాజవుల్లా, కార్యదర్శి శ్రీనివాస్ జివి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల్లోని గర్భిణీలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు



**వేలేరుపాడు,మేజర్ న్యూస్:** భారీ వర్షాలు, వరద మూలంగా వేలేరుపాడు మండలంలోని పలువురు నెలలు నిండిన గర్భిణీలను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేర్చడం జరుగుతుందని ఐసిడిఎస్ పిడి కె.పద్మావతి తెలిపారు. శుక్రవారం సునీత అనే గర్భిణీని, మరో 9 నెలలు నిండిన మరో గర్భిణీని అంబులెన్స్ ద్వారా వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు సంబంధిత వైద్యులు పరీక్షిస్తున్నారన్నారు. మండలంలోని 12 నివాసిత ప్రాంతాల్లోని 31మంది గర్భిణీలను, 27 మంది బాలింతలను గుర్తించడం జరిగిందన్నారు. వారికి అవసరమైన వైద్య సేవలును అందించడం జరుగుతుందన్నారు.

## వరద బాధిత ప్రాంతాల ప్రజలను, రైతాంగాన్ని ఆదుకోవాలి

- సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్

**ఏలూరు,మేజర్ న్యూస్:** భారీగా కురుస్తున్న వర్షాల వల్ల వచ్చిన వరదలతో ప్రజలు, రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లాలో ముఖ్యంగా ఏజన్సీ ప్రాంతంలో కొండవాగులు, కాలువలు వరద నీటితో నిండిపోయి రవాణా సమస్యలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. మంచినీటి సరఫరా దెబ్బతిని త్రాగునీరు కాలుష్యమై దయేరియా, విష జ్వరాలు వంటి వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఏజన్సీ ప్రాంతాలకు, మారుమూల గ్రామాలకు యుద్ధప్రాతిపదికన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పట్టిన పాలెం,రెడ్డి గణపవరం వంతెన నిర్మించకపోవడం వలన ఏజెన్సీ ప్రాంత వాసులకు రవాణా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. పెదవాగు ప్రాజెక్టు తెలంగాణ ఆధీనంలో ఉన్నందువలన దాని వలన వచ్చే దుష్పరిణామాలు విలీన మండలాలపై పడుతున్నాయని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై వెంటనే ఆలోచించి విలీన మండలాల ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు.

సూర్య
పశ్చిమ గోదావరి
శనివారం,
20 జూలై 2024


## ముంపునకు గురైన రామవరంకి చెందిన గర్బిణీ స్త్రీ ప్రసవం



వేలేరుపాడు, మేజర్ న్యూస్:. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో పెద్దవాగు పరివాహక ప్రాంతంలో ముంపుకు గురైన రామవరం గ్రామానికి చెందిన గర్బిణీ స్త్రీ వేలేరుపాడు ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా శిశువుకు జన్మనిచ్చింది. పిహెచ్ సి వైద్యురాలు డా. అగత, ఎఎన్ఎం ఎస్తేరు మాట్లాడుతూ తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని వారు తెలిపారు.

## యూత్ రూపొందించిన జో కవర్ షార్ట్ ఫిలిం



కైకలూరు,మేజర్ న్యూస్: కైకలూరు యువత రూపొందించిన జో షార్ట్ ఫిలింను జనసేన పార్టీ నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబి) ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా కొల్లి.బాబి మాట్లాడుతూ కైకలూరు గ్రామానికి చెందిన చందు,రూప హీరో హీరోయిన్లుగా ఆనంద్ డైరెక్షన్లో కెమెరామెన్ గా భాను నటీనటులుగా మోహన్ సాయి,సతీష్ కన్నా నటించిన షార్ట్ ఫిలిం చాలా ఆహ్లాదంగా ఉందని, ప్రేమ సెంటిమెంటు కుటుంబ నేపథ్యం బాంధవ్యాలను గుర్తుచేస్తూ తీసిన షార్ట్ ఫిలింను సినిమాను తలపించిందని పేర్కొన్నారు. ఈ షార్ట్ ఫిలిం లో నటించిన హీరో హీరోయిన్లు, డైరెక్టర్ ఆనంద్ కెమెరామెన్ గా పనిచేసిన భాను నువ్వు కచ్చితంగా కైకలూరుకి మంచి పేరు తీసుకువస్తారని వారికి మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తులసి పూర్ణ,పుప్పాల సూర్య ప్రకాష్,తోట సంజయ్,మండల సురేష్, మణికంఠ, తులసి శివా,ముత్యాల తరుణ్ సాయి,పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

## టీచింగ్ టూల్స్ ట్రైనింగ్ సందర్శన



పాలకొల్లు ,మేజర్ న్యూస్: సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్) ప్రాజెక్టు లో బాగంగా, రాష్ట్ర స్థాయిలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, అప్పర్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సిఆర్పి లకు జూలై 18 నుంచి 27 వరకు టీచ్ టూల్స్ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు, స్థానిక బి ఆర్ ఎం బి ఎం హెచ్ స్కూల్ నందు జరిగిన కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా సమగ్ర శిక్ష ఏబిసి,పి.శ్యాంసుందర్ మాట్లాడుతూ టీచ్ టూల్స్ శిక్షణ ద్వారా తరగతి బోధనా పద్ధతులు ఎలా తనిఖీ చేయాలి,చేసిన తర్వాత బోధనా పద్ధతులు ఎటువంటి విధంగా అభివృద్ధి చేసుకోవాలి అని పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు, పశ్చిమ గోదావరి జిల్లా తరుపున 14 మాస్టర్ ట్రైనర్స్ రాష్ట్రస్థాయిలో శిక్షణ తీసుకుని జిల్లాలో 3 సెంటర్స్‌లో, 300 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సాల్ట్ పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లా ప్రతినిధి చంద్రశేఖర్ మాట్లాడుతూ టీచ్ టూల్ ప్రపంచ బ్యాంక్ ఎడ్యుకేషనిస్ట్ వారిచే రూప కల్పన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎంఈఓ 1 గుమ్మళ్ళ వీరాస్వామి,ఎంఈఓ2 శర్మ మాస్టర్ ట్రైనిస్ లక్ష్మీనారాయణ. నరేష్. రాయపూడి భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలి



**అత్తిలి,మేజర్ న్యూస్:** భారీ వర్షాల కారణంగా ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడా నాగరాణి సచివాలయ సిబ్బందికి తెలిపారు. భారీ వర్షాలు వరదలు కారణంగా జిల్లాలో పలు ప్రాంతాలను పర్యటించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం అత్తిలి-1 సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో ఎంతమంది పనిచేస్తున్నారు. విధుల్లో ఎంతమంది ఉన్నారని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది పేర్లను చదువుతూ ఎవరు ఏ విధులు నిర్వహిస్తున్నారు అని సిబ్బందిని ప్రశ్నించారు. విధి నిర్వహణలో ఎవరు అలసత్వం వహించిన సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా గ్రామాల్లో ఎటువంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యం లో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయం తనిఖీ సందర్భంలో పంచాయతీ కార్యదర్శి కె.సుజాత, మండల విస్తరణ అధికారి ఎం.శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## భీమవరంలో బియ్యం వ్యాపారి అనుమానాస్పద మృతి

**భీమవరం, మేజర్‌న్యూస్:** బియ్యం వ్యాపారి అనుమానాస్పద స్థితిలో మృతి శుక్రవారం ఉదయం నాగిడి పాలెం కాలువలో వెంకట నారాయణ మృతదేహం లభ్యమైంది.ఈనెల 17న బకాయిల వసూలుకు వెళ్లిన గోంట్ల వెంకటనారాయణ అదృశ్యం.పనిచేయని సెల్ ఫోన్, బంధువులు వెతికినా తెలియని ఆచూకీ.భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో భార్య లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు చేసింది.

## ఏలూరు నగరపాలక సంస్థచే దోమల నివారణ కార్యక్రమం



**ఏలూరు, మేజర్ న్యూస్:** 1 జూలై 2024, నుండి 31, ఆగస్టు, 2024 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 41వ డివిజన్ చోడిదెబ్బలోని ఏటిగట్టు, రెహమత్ నగర్, చిన్న రామాలయం ఏరియా, పెద్ద రామాలయం ఏరియా, తంగిళ్ళముడి మెయిన్ రోడ్డు, సచివాలయం ఏరియా, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూనలకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలలోఉన్న నిలవనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం జరిగినది. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.మాలతి, నాయకులు జాగాని సంతోషి ప్రసాద్ ,మలేరియా ఇన్స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా సూపర్వైజర్ డి. దుర్గారావు, సానిటరీ ఇన్స్పెక్టర్ టి.సత్యనారాయణ, కె.విశ్వేశ్వర రావు , ఆరోగ్య కార్య దర్శి, ఆశా కార్యకర్తలు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు వరి పంటలను కాపాడుకోవడానికి తగిన చర్యలు

**- ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఫణికుమార్ సూచన**



**పెదవేగి,మేజర్‌న్యూస్:** అల్పపీడనద్రోణిప్రభావంతోకురుస్తున్న భారీవర్షాల కారణంగా వరిపంట ముంపునకు గురై, పాడయ్యే ప్రమాదం ఉందని. పంట సంరక్షణకు తక్షణం చర్యలు చేపట్టాలని ఏలూరు ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.ఫణికుమార్ చెప్పారు. తక్షణం సంరక్షణ చర్యలు చేపట్టకపోతే పంటను నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ విడవకు ండా కురుస్తున్న వర్షాలతో వివిధదశల్లో ఉన్నవరి పంట పాడయ్యే అవకాశాలు ఎక్కువుగా ఉన్నాయన్నారు. జూన్ నెలలో విత్తిన పంట పిలకల దశలోనూ, జూలైనెలలో విత్తినపంటనారుమడి దశలోనూ. నేరుగావిత్తిన పంట మొలకదశలోనూఉన్నాయని చెప్పారు. అధిక వర్షాలకు నారుమ డిలో విత్తనం చల్లిన రెండు, మూడు రోజుల వయస్సులో మూడు రోజులకంటే ఎక్కువ గాఆ నీటి మునిగితే మొలకశాతం గణనీ యంగా తగ్గుతుందని, వీలైనంత త్వరగానీరుబయటకు తీసేయాలని ఆయన తెలిపారు. రైతులు సకాలంలో యాజమాన్య పద్ధతు లను చేపట్టకపోతే పంటనష్ట పోయే ప్రమాదం ఉందని డాక్టర్ ఫణికుమార్ తెలిపారు.

## పెద్దవాగు ముంపు నిరాశ్రుయులకు పరామర్శ





**- పునరావాస కేంద్రాలకు తరలింపు : జేసి బి.లావణ్యవేణి**

**వేలేరుపాడు,మేజర్ న్యూస్:** భారీ వర్షాలు, వరదలు నేపధ్యంలో శుక్రవారం వేలేరుపాడు మండలంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పర్యటించారు. పెద్దవాగు ముంపుతో నిరాశ్రుయులైన అల్లూరినగర్ కుటుంబాల ను పరామర్శించి పునరావాస కేంద్రాలకు రావాలని కోరారు. ముంపునీటికి గురైన ఇళ్లల్లో ఉండకుండా పునరావాస కేంద్రంలో తలదాచుకోవాలన్నారు. పునరావాస కేంధ్రాల్లో వారికి అవసరమైన ఆహారం, త్రాగునీరు, తదితర ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న రెవిన్యూ అధికారులు గ్రామ ప్రజలను పునరావాస కేంద్రాలని తీసుకువెళ్లడానికి అవసరమైన ఏర్పాట్లను చూడాలని ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేలాగా చర్యలు తీసుకోవాలని అలాగే గ్రామంలో వైద్యాధికారులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండి ప్రజలకు తక్షణమే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ముంపు ప్రాంత రైతులకు నష్టపరిహారం అందించాలి

**- అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డీ రఘురాం**



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తాడేపల్లిగూడెం మండలంలోని ముంపుకు గురైన నవాబుపాలెం, మారంపల్లి, నందమూరు, మాధవరం,అప్పారావుపేట,జగన్నాధపురం, ఆరేళ్ళ గ్రామాల్లో ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ ఆథారిటీ మాజీ వైస్ చైర్మన్ వడ్డీ రఘురామ్ నాయుడు విస్తృతంగా పర్యటించారు. నష్టపోయిన రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు.ముంపు ప్రాంతాలైన రైతులతో మాట్లాడి పంట నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురాం మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్ర కాలువ ఉధృతి పెరిగి రైతాంగం నష్టపోయిందని అన్నారు. ఎర్ర కాలువ సమస్య పరిష్కరించడానికి పార్టీలకతీతంగా, ప్రాంతాలకు అతీతంగా రైతుల కోసం అందరూ పని చేయాలని విజ్ఞప్తి చేశారు. నరసాపురం ఎంపీ, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ సహాయం తీసుకుని రైతులను ఆదుకోవాలని వైఎస్ఆర్సిపి తరపున కోరుకున్నట్లు తెలిపారు. నియోజవర్గంలో ఉన్న రైతుల సమస్యలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తెలియజేస్తామని అన్నారు. ఆయన వెంట జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ శేషులత, ఆరెళ్ల సర్పంచ్ మాకరాజు సతీష్, ఉండ్రాజవరపు లక్ష్మణరావు, కృపావరం, తదితరులు పాల్గొన్నారు.

## వీకెండ్ వినోదం - డీడీ రిటర్న్స్ శనివారం సాయంత్రం 6 గంటలకు జీ సినిమాలులో అండ్ గామి ఆదివారం సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో!




**రాజమండ్రి,మేజర్ న్యూస్:** తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీలో అత్యంత ఆదరణ గల రెండు ఛానళ్లుజీ తెలుగు, జీ సినిమాలు తమ ప్రేక్షకులను అలరించడానికి మరోసారి సిద్ధమయ్యాయి. వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులకు ఎనలేని వినోదం పంచుతున్న ఈ ఛానల్స్ మరోసారి బ్లాక్బస్టర్ సినిమాలతో ఈ వారాంతంలో అలరిం చేందుకు సిద్ధమయ్యాయి. జులై 20 శనివారం సాయంత్రం 6 గంటలకు జీ సినిమాలులో డీడీ రిటర్న్స్ (భూతాల బంగ్లా), జులై 21 ఆదివారం సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో గామి వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ప్రసారం కానున్నాయి! హారర్ కామెడీ సినిమాగా ప్రేక్షకులను అలరించిన డీడీ రిటర్న్స్(భూతాల బంగ్లా) సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోంది జీ సినిమాలు. ఈ సినిమా కథ దశాబ్దాల క్రితం పాండిచ్చేరి శివార్లలోని ఒక రాజభవనంలో ప్రారంభమవుతుంది. అక్కడ ఆటలో ఓడిపోయిన వారు కుటుంబ సభ్యులచే చంపబడతారు. ప్రస్తుతం ఒక డాన్ కు చెందిన పెద్ద బ్యాగ్ నిండా డబ్బు, నగలు మరో ముఠా దోచుకుంటుంది. పొరపాటున ఆ బ్యాగ్ సతీష్ (సంతానం) మరియు అతని స్నేహితుల దగ్గరకు వస్తుంది. డబ్బు కోసం జరిగే పోరాటంలో హీరో గెలుస్తాడా, ఓడిపోతాడా అనేదే కథ. సంతానం, సురభి, రెడిన్ కింగ్స్లే, మారన్, టైగర్ తంగదురై, ఫెఫ్సీ విజయన్, ధీనా, దీప వంటి నటులు ప్రముఖ పాత్రలు పోషించిన ఈ సినిమాను జీ సినిమాలు వేదికగా మీరూ చూసేయండి! ఇక, వారాంతం వినోదంలో భాగంగా గామి సినిమా ఆదివారం ప్రసారం అవుతుంది. 'గామి' కథ మానవ స్పర్శ కారణంగా మూర్ఛపోయే అరుదైన సమస్యతో బాధపడుతున్న శంకర్ (విశ్వక్సేన్) అనే అఘోరా చుట్టూ తిరుగుతుంది. ద్రోణగిరి పర్వతంపై దొరికే అరుదైన మాలి పత్రాల అన్వేషణకు బయల్దేరిన శంకర్కి, దేవదాసి దుర్గ(అభినయ), ఆమె కూతురు(హారిక), జాహ్నవి(చాందినీ చౌదరి)కి గల సంబంధం ఏంటనేది తెలియాలంటే జీ తెలుగులో ప్రసారం కానున్న గామి సినిమా చూడాల్సిందే. విద్యాధర్ కగితా దర్శకత్వం వహించిన ఈ సినిమా యాక్షన్, సస్పెన్స్ మేళవింపుతో ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకుంటుంది. అత్యున్నత స్థాయి సంగీతం ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. విశ్వక్సేన్, చాందినీ చౌదరి, అభినయ, మహ్మద్ సమద్, హారిక పేడాడ, శాంతిరావు, మయాంక్ పరాక్ నటన మరిచిపోలేని అనుభూతినిస్తుంది. కామెడీతోపాటు సస్పెన్స్ థ్రిల్లింగ్ ఫీల్ని పొందాలంటే ఈ వారాంతంలో జీ సినిమాలు, జీ తెలుగులో ప్రసారం కానున్న డీడీ రిటర్న్స్, గామి సినిమాలను మిస్ అవకండి.

## గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్ బాబు రాజమహేంద్రవరం ప్రభుత్వ' ఆసుపత్రి నందు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం, 1994 పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రకాష్ బాబు మాట్లాడుతూ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం, 1994 లో చెప్పబడిన నిబంధనల గురించి వివరించారు. గర్భంలోని బిడ్డ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు, జన్యు పరమైన మరియు ఇతర లోపాలను తెలుసుకునేందుకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించాలని, లింగ నిర్ధారణ కోసం స్కానింగ్ చేయడం నేరమని, అలాంటి వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడు తుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న కేంద్రాలు మాత్రమే పరీక్షలు చేయాలని, ఈ చట్టం లో పేర్కొనబడినట్లు వైద్య బృందం లేదా పరీక్షలు నిర్వహించిన వారు సైగలు, మాటలు మరే విధంగా కానీ గర్భస్థ శిశు వు లింగాన్ని తెలియజేయరాదని అన్నారు. ఈ చట్టాన్ని సరైన విధంగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు తరచుగా స్కానింగ్ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించాలని, స్కానింగ్ కేంద్రాల ఆవరణలో ఈ చట్టం గురించి ప్రజలకు అవగాహన కలిగేలా పోస్టర్లు ఏర్పాటు చెయ్యడంతో పాటు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఏ.ఎన్. ఎంలు, ఇతర వైద్య సిబ్బంది ప్రజలకు ఈ విషయాల పై అవగాహన కల్పించాలని అన్నారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టం, 1987 ప్రకారం అర్హతగల వారికి ఉచిత న్యాయ సహాయం అందించ బడుతుందని, ఎవరికి ఎలాంటి న్యాయ సందేహాలున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు గారు వన్ స్టాప్ సెంటర్ ను సందర్శించి వసతులను పరిశీలించారు.ఈ సదస్సులో రాజమహేంద్రవరం డిప్యూటీ డి. ఏం.హెచ్.ఓ డా.ఎమ్. శ్రీహరి బాబు , డిప్యూటీ డి.ఇ.ఏం.ఓ డా.ఎన్. సత్య కుమార్ , వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్‌టి, ఆదాయ పన్నుల చెల్లింపులపై వర్క్‌షాప్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** స్థానిక నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం రాష్ట్ర ఆడిట్ శాఖ మరియు ఇనకం ట్యాక్స్, రాజమండి వారు సంయుక్తంగా ఆధ్వర్యంలో జి ఎస్ టి, ఆదాయ పన్నుల చెల్లింపు లపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్ డి.విజయభారతి మాట్లాడుతూ , స్థానిక సంస్థలు అని యూనివర్సిటీల పరిధిలో జి ఎస్‌టి, ఆదాయ పన్ను మినహాయింపులు సమయంలో తీసుకోవల సిన అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకు సంబంధించిన మెటీరియల్ కూడా అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మూల ధనం పన్ను మినహాయింపు , మూల ధనం నుంచి వసూలు పై తగిన అవగాహనా కలిగి ఉండాలన్నారు. టీ డి ఎస్ అనేది ఒక నిర్దిష్ట పరిమితిని మించి ఉన్నా , ఒక వ్యక్తికి కంపెనీ చేసిన చెల్లింపుపై తీసివేయబడే పన్ను , టీసీఎస్ అనేది కొనుగోలుదారులకు ఏదైనా విక్రయించేటప్పుడు విక్రేతలు వసూలు చేసే పన్ను విధానం అని తెలిపారు. నగర పాలక సంస్థ కమిషనర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ, రాజమండ్రి నగరపాలక సంస్థ, నిడదవోలు, కొవ్వూరు సిబ్బంది, ఆదికవి నన్నయ యూనివర్శిటి అకౌంట్ సిబ్బందికి , జిఎస్టి , ఇన్ కమ్ ట్యాక్స్ సంబంధ అంశాల పై సమగ్ర సమాచారం తెలుసు కునేందుకు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్కమ్ ట్యాక్స్ అదనపు కమిషనర్ కె. శ్రీనివాసులు, జోన్ 2 స్టేట్ ఆడిటర్ ఆర్డిడి బి. చిన్నపరెడ్డి, జోన్ 1 స్టేట్ ఆడిట్ ఆర్డిడి పి.సీతారామారావు, జిల్లా ఆడిట్ అధికారి కే.ఎన్. వెంకటేశ్వరరావు, ఇన్ కమ్ ట్యాక్ అధికారి కె.దేవదత్తం, చార్టెడ్ అకౌంటెంట్ టి. భాను పృధ్వీ రాజ్‌లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి...

**- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ**

**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రజా ప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసే ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రజలకు మేలు చేసే విధంగా పనిచేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు ఆయన పి. గన్నవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులు సమావేశంలో వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ ఆయా ప్రభుత్వ శాఖల పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో ఏ విధమైన ఇబ్బందులు ఎదురైనా ఉన్నత అధికారులు దృష్టికి తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ హుస్సేన్, ఎంపీడీవో త్రిశూలపాణి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## మంత్రి దుర్గేష్‌ని కలిసిన పిఠాపురం బీసీ నాయకులు బద్రి



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ టూరిజం మరియు సినీ ఆటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ని పిఠాపురం జనసేన బీసీ నాయకులు నక్కా బద్రి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా పిఠాపురం జనసేన బీసీ నాయకులు నక్కా బద్రి మాట్లాడుతూ... ఏపీ టూరిజం మరియు సినీ ఆటోగ్రఫీ బాధ్యతలు స్వీకరించినందుకు వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ హర్షం వ్యక్తం చేసారు.

ఈ కార్యక్రమంలో పిఠాపురం జనసేన పార్టీ నాయకులు ఉమ్మడి జిల్లా కార్యదర్శి బండి ఏసుబాబు, బండి వెంకన్న బాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి నూతన అన్నదాన భవన నిర్మాణానికి కొమ్మరిపాలెంకు చెందిన కొవ్వూరి రాజశేఖర్‌రెడ్డి, వినోదబాల దంపతులు రూ.లక్ష; కొమ్మరాజులంకకు చెందిన కర్రి శ్రీనివాసరెడ్డి, వెంకటలక్ష్మి దంపతులు రూ.25 వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## తమ్మిలేరు రిజర్వాయర్‌కు పెరిగిన వరద

**చింతలపూడి, మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లా చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెం వద్ద గల తమ్మిలేరు రిజర్వాయర్ లోనికి శుక్రవారం ఉదయం సమాచారం ప్రకారం కాచ్ మెంట్ ఏరియా లో వర్షం, ఎగువ నుండి వస్తున్న వరద 1527 క్యూసెక్కులు గా వున్నట్లు ఎ.ఇ.ఇ. పరమానందం తెలిపారు.

రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరు బేసిన్ 338.2 అడుగులు గాను గొనెల వాగు బేసిన్ 336.33 అడుగులు గాను వుంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టి.ఎం.సి.లు కాగా ప్రస్తుత నీటి నిల్వ 0.841 టి.ఎం.సి.లుగా వుందని పరమానందం తెలిపారు.